# కాలదోషం

## కోటంరాజు జనార్దనరావు

పన్నెండున్నరయింది. అందరూ వెళ్లారన్న ఆశతో వొళ్లు విరుచుకుంటూ లేచి ఛాంబర్సు తలుపు మూద్దామని గుమ్మం దగ్గరకు వెళ్లాడు లాయర్ సుధాకర్. ఒళ్లో తలపాగా పెట్టుకొని బల్లమీద కునుకు పాట్లు పడుతూ, జోలపాటగా గుర్రుపెడుతున్నాడు షావుకారు.

అరె! ఈతని మాట తాను పూర్తిగా మరిచిపోయాడు. అదిగాక ప్లీడర్లకు ఎదురుగుండా వున్న వాడు పెళ్లికొడుకు. కనుమాటుగా కూర్చుని కునికిపాట్లు పడుతున్న ఈ ఆగంతుకుని మాటే మరచిపోయాడు, పనిలో నిమగ్నుడయిన సుధాకర్.

అతని స్థితి చూస్తే జాలివేసింది. "షావుకారు గారూ!" అన్నాడు మంద్రస్థాయిలో. "అయ్యా!" అంటూ వులిక్కిపడి లేచాడు తలపాగా సర్దుకుంటూ షావుకారు.

"లోపలికి రండి." అన్నాడు సుధాకర్ బరువుగా, అలసటగా.

ఇది గమనించి షావుకారు "భోజనం చేసి రాండి. తొందరలేదు. కూర్చుంటాను." అన్నాడు. బలవంతపెట్టాడు. అతనిలోని సహనాన్ని చూస్తే సుధాకరునికి ఆశ్చర్యం వేసింది. బహుశా! ఏదో తీరని ఆపత్తులో వుండి వుంటాడు- అనుకుంటూ, లోపలకు వెళ్లాడు భోజనానికి షావుకారు బలవంతంపై. మళ్లీ క్లయింట్లు సేవకై తిరిగి ఛాంబర్సులోకి వెడతాడని తెలిసిన సుధాకర్ భార్య రుసరుస లాడుతూ, ఆగంతుకుని అనవసరంగా నిందిస్తూ వడ్డించింది. అది వాళ్ల జీవితంలో మామూలు. తన భర్త అతని జీవితాన్ని భార్యను మరచి క్లయింట్లకు ధారాదత్తం చేస్తున్నాడని అమె అభియోగం. నోట్లకట్టలను తెచ్చి భర్తయిచ్చినప్పుడు మాత్రం సుధాకరుని అమె తాత్కాలికంగా క్షమిస్తూ వుంటుంది.

"కొత్త క్లయింటు. అది గాక షావుకారు." అన్నాడు సుధాకర్ పెరుగు కలుపుకుంటూ.

"ఏమో! మీయిష్టం. నేను నిద్రపోతాను." అన్నది సుధాకర్ భార్య, మూతి విరుస్తూ.

విటమినెట్సు మాత్రలు మ్రింగి, వక్కపొడి నమలుతూ బయటపడ్డాడు సుధాకర్.

### 2

సంచిలోని కాగితాలను తీస్తూ షావుకారు తన సమస్య చెప్ప నారంభించాడు. సుధాకర్ బ్రీఫ్ బుక్కు తీసుకొని కావలసిన పాయింట్సు నోటు చేసుకున్నాడు .

ఆయన పేరు భూమయ్య. పూర్వాశ్రమంలో బులియన్ వ్యాపారం చేశాడు. భాగస్థులు మోసం చేయడం కారణంగా ప్రస్తుతం చితికాడు.

తన వ్యాపారం బాగా ఝుంఝూ మారుతంగా వున్న రోజుల్లో తన మిత్రుడు కాశయ్య తనకు అవసరమైనప్పుడు వ్యాపార నిమిత్తమయి డబ్బు సాయం చేస్తుండేవాడు. తాను అప్పుడింత అప్పుడింత తిరిగి యిస్తూ వుండేవాడు. స్నేహం కారణంగా అర్థరూపాయి వడ్డీతో తాను తెచ్చుకుంటూ వుండేవాడు. ఈ లెక్క జమ కాశయ్య పుస్తకాల్లో వ్రాయబడుతూ వుండేది.

కాశయ్య కొన్నాళ్లకు మంచ మెక్కాడు. అతనికి బ్రతుకుతాననే ఆశ సన్నగిల్లింది. ఒక రోజున భూమయ్యను పిలిపించాడు. కాశయ్య భార్య ఏనాడో కాలం చేసింది. ప్రక్క దగ్గర అతన్ని కనిపెట్టుకున్న యతిరాజమ్మ కూర్చుని వుంది ఏడుస్తూ. యతిరాజమ్మ అతన్ని నమ్ముకొని ఉన్న దూరపు బంధువు. కాశయ్య, ఎందుకయినా మంచిది లెక్కచూచి కాగితాం వ్రాసి యిమ్మన్నాడు.

లెక్కలు చూచుకొన్నారు. మా ఖర్చుల్లో కాస్త హెచ్చుతగ్గులు వచ్చాయి! వాదించుకున్నారు. చివరకు భూమయ్య పదివేలు యివ్వతేలినట్లుగా నిర్ణయించుకున్నారు. కాశయ్య, షరగత్తు వ్రాసిమ్మన్నాడు భూమయ్యను. మిత్రుని కోరిక ప్రకారం, భూమయ్య వ్రాసియిచ్చాడు. "లెక్కలు చూచుకోగా పదివేలు యివ్వతేలానని, అర్థరూపాయి వడ్డీతో మూడు సంవత్సరాలలో తిరిగి యివ్వగలనని."

కాశయ్య కాంపౌడు వడ్డీ కట్టాడు తనదగ్గర, అంటాడు భూమయ్య. స్నేహితుడు తనను యిట్లా మోసగిస్తాడని భావించలేదన్నాడు. సరే, అనుకున్న ప్రకారం మూడు సంవత్సరాల గడువులో చెల్లించాలి గనుక భూమయ్య అప్పుడప్పుడూ చెల్లిస్తూ వచ్చాడు. షరగత్తు పుస్తకం కాగితాలలో ఈ జమలు వ్రాయబడ్డాయి. కాలం చేస్తానని భయపడ్డ కాశయ్య కాలం చేయలేదు. షరగత్తు వ్రాసిన ఆరేళ్లకు కాలం చేశాడు. తాను నిలబడి మిత్రుని అంత్యక్రియలన్నీ జరిపించాడు భూమయ్య; అతని ఆత్మశాంతకై ఘనంగా దానధర్మాలు చేయించాడు.

కాశయ్యకు నా అన్నవారు ఎవరూ లేరు; తన్ను నమ్ముకున్న యతిరాజమ్మ, తమ్ముని సంతానం ఒక్కగా నొక్క కుమార్తె తప్ప. ఇరువురిని పరామర్శలుచేసి, పదిరోజుల తర్వాత యింటికి చేరాడు భూమయ్య.

దిన వారాలయిన వారం పది రోజులకు తనకు రెండు లాయరు నోటీసులు వచ్చాయి. ఒకటి యతిరాజమ్మ తరపు నుంచి; రెండవది కాశయ్య తమ్ముని కుమార్తె దగ్గర నుంచి "తన పేరిట కాశయ్య వీలునామా వ్రాశాడనిన్నీ, అందు మూలముగా కాశయ్య యావదాస్తికి తాను సర్వాధి కారిణిననీ, అందుమూలంగా ఆ నోటీసు అందిన వారం రోజులలో షరగత్తు క్రింద మిగిలిన అసలు ఫాయిదాలు చెల్లించవలసిందనీ, లేనిచో తగు చర్యలు తీసుకోబడునని." యతిరాజమ్మ నోటీసులోని సారాంశము.

"కాశయ్య వీలునామా వ్రాయలేదని, అది కేవలము యతిరాజమ్మ సృష్టేనని, తాను హిందూ ధర్మ శాస్త్రానుగుణ్యంగా వారసురాలననీ, కాన షరగత్తు బాబతు అసలు ఫాయిదాలు తనకు వారం రోజులలో చెల్లించవలసినదనీ, లేనిచో తగుచర్యలు తీసుకోబడునని, దాని ఖర్చులపై భూమయ్యయే బాధ్యుడనిన్నీ" - కాశయ్య తమ్ముని కుమార్తె నోటీసు సారాంశము.

భూమయ్య తన అరవైయేళ్ల జీవితంలో ప్లీడరు నోటీసు అందుకోవటం యిదే ప్రప్రథమం. ఇదా కాశయ్య వారసులు తనకు చేసే ప్రత్యుపకారం! కాశయ్యశవం దహనానికే శక్తిలేని సమయంలో

తాను నిలబడి, అతని ఘనతకు తగినట్లుగా ఖర్చుపెట్టాడే. ఆ మాత్రం వారసులకు కృతజ్ఞత లేదే-అనుకున్నాడు. పైగా వాళ్ళ తాను ఖర్చుపెట్టిన మొత్తం జమ పెట్టకుండానే రూపాయలకై నోటీసు పంపారు.

భూమయ్యకు ప్లీడరు దగ్గరకు వెళ్లక తప్పలేదు. నోటీసులు రెండు చూపించాడు. ప్లీడరు విషయం అంతా విని భూమయ్య అభిప్రాయ మేమిటని అడిగాడట. తనకు ఋణశేషం వుంచుకోనుద్దేశం లేదని, యిరుపక్షాలు కాశయ్య ధనానికి వారసుల మంటున్నారు గనుక, న్యాయలయాన్నుంచి కాశయ్య వారసులమని ఎవరయితే సర్టిఫికేటు తేగలరో వారికి తాను ఋణశేషం చెల్లించడానికి సిద్ధంగా వున్నానని, తన లెక్క ప్రకారం వారు నోటీసులలో కోరినంత ఈయనక్కరలేదని, చాల తక్కువ సొమ్మే బాకీ వున్నానని తెలియబర్చాడు భూమయ్య. ప్లీడరు అదే ప్రకారం నోటీసులకు జవాబు పంపాడు.

భూమయ్య నోటీసులోని వాదనను, సదుద్దేశాన్ని లెక్క చేయకుండానే, యతిరాజమ్మ కోర్టులో దావావేసింది. సమన్లు ముట్టిన వెంటనే భూమయ్య తిరిగి ఆ ప్లీడరును కలుసుకున్నాడు. భూమయ్య ఎల్లప్పుడు, ఏకాభిప్రాయం గలవాడని తెలుసుకొని "అనవసరంగా దావా వేశారు కనుకనూ, తానెల్లప్పుడు కోర్టు నిర్ణయించిన కాశయ్య వారసునకు ఋణశేషం చెల్లించడానికి సిద్ధంగా వున్నాను గనుకను తాను కోర్టు ఖర్చులకు బాధ్యుడనుగాను." అని ఆన్సరు పెట్టాడు ప్లీడరు.

తన ఆన్సరు విని కోర్టువారు కేసు పెండింగులో పెట్టి, యతిరాజమ్మను వారసురాలిగా సర్టిఫికేటు తెమ్మని, టైము యిచ్చారు. ఒక సంవత్సరంలో యతిరాజమ్మ తన పేరునవున్న కాశయ్య వీలునామాను రుజువు చేసుకొని కాశయ్య తమ్ముని సంతానపు హక్కులను త్రోసిపుచ్చి జిల్లా కోర్టునుంచి సర్టిఫికేటు తీసుకొనివచ్చి దాఖలు చేసింది.

ఇప్పుడు భూమయ్యకు అసలయిన సమస్య ప్రారంభమయింది. అప్పుడే కాశయ్య కాలం చేసి రెండేళ్లయింది. ఈ రెండేళ్లలో కాలగతిలోపడి భూమయ్య చితికిపోయాడు. పూర్వపు ఋణశేషాన్ని వుంచకూడదనే వుద్దేశం అదే ప్రకారం తనలో వున్నదికానీ, తన స్థితిగతులు అదే మాదిరిగా లేవు. తాను ఇప్పుడు ఆన్సరులో అన్న ప్రకారం ఋణశేషాన్ని యతిరాజమ్మకు చెల్లించలేడు. దానికల్లా ఒకటే మార్గం యతిరాజమ్మను దావాలో వోడించాలి.

తాను చాలకష్టాలలో వున్నాడు. తిరిగి ప్లీడరును కలుసుకొని చెప్పాడు. కాశయ్య వడ్డీలకు వడ్డీలు పెంచి ఋణభారాన్ని పెద్దచేశాడు. అదిగాక కాశయ్యకు అంత్యక్రియలు, దినవారాలు తానుఘనంగా చేశాడు. తాను మిత్రత్వంలో లెక్కలు వ్రాయలేదు. షుమారు రెండు వేలు తనకు జమరావాలి. లెక్కలేదు గనుక కోర్టు నమ్మదు. అందుకని తన ఈ ప్రస్తుత క్లిష్టపరిస్థితులను చూచి, దావాను ఏదోవిధంగా గెలవాలని తన ప్లీడరును బ్రతిమాలాడు. ఆయన " లాభం లేదు. ఒకసారి ఆన్సరులో ఋణశేషాన్ని ఒప్పుకున్న తర్వాత దావా గెలవడం కష్ట" మన్నాడు. ఈ అభిప్రాయం తనకు ఆన్సరు పెట్టిన నాడే చెప్పి వుండాల్సిందన్నారు. భూమయ్య బలవంత పెట్టాడు. ప్లీడరు ఏ విధంగాను లాభం లేదని రాజీపడమని సలహాయిచ్చాడు. ఛా! ఆ కృతఘ్నులను ఆశ్రయించి తాను రాజీపడటమా! వాళ్ళు ఎక్కడ పడితే అక్కడ దుర్భాష లాడుతున్నారు, తాను కాశయ్యను ద్రోహం చేశనని. పైగా తన్ను దావా గెలిచి సివిలు జెయిలులో పెట్టిస్తామని ప్రచారం చేస్తున్నారు.

అందుకని ఆ ప్లీడరుగారి సలహానచ్చక, సుధాకర్ పేరు ప్రఖ్యాతులను విని మరీ వచ్చాననీ, తన్ను తప్పక గెలిపించవలసిందనీ అంటూ సుధాకర్‌కు సాష్టాంగ ప్రణామం చేశాడు భూమయ్య.

సుధాకర్ యిరకాటాన్ని పడ్డాడు. పరిస్థితులు మనిషిలో ఎంత మార్పును తీసుకువస్తాయా అనుకున్నాడు. "రికార్డువుంచి రేపు రాండి. చదివిచెప్తాను." అని టైము యిచ్చాడు. ఏమయినాసరే తన్ను గట్టెక్కించాలంటూ రాత్రి రెండుగంటలకు భూమయ్య నిష్క్రమించాడు.

3

నిర్ణీతకాలానికి అరగంట ముందుగానే భూమయ్య సుధాకర్ ఛాంబర్సుకువచ్చి "నమస్కారమండీ!" అన్నాడు. అతని కన్నుల్లో ఆశ తొంగిచూస్తోంది. పని చేసుకుంటున్న సుధాకర్ భూమయ్య వంకచూచి, చేతిగడియారం వంక చూచాడు. "యివ్వాళ మా దుకాణం బందు. అందువల్ల ముందుగానే వచ్చాను. తొందరలేదు. కూర్చుంటాను." అంటూ భూమయ్య వరండాలో వున్న నిన్నటి తన ఆసనంవైపు నడిచాడు.

సుధాకర్, అతనిలోని సహనాన్ని చూచి ఆశ్చర్యపడ్డాడు. సాధారణంగా క్లయింట్లు తమ పని అనుకున్నదానికన్నా అరగంట ముందుగానే కావాలని ఆవేశపడుతారు. తాము తొందరపడుతారు. ప్లీడరును తొందరపెడుతారు. స్థిమితంగా సమస్యను పరిష్కారం చేయనీయరు. తొందరలో తప్పటడుగు పడుతుంది. తరువాత విచారిస్తారు. భూమయ్య ప్రకృతి దానికి విరుద్ధంగా వుంది. ఏమిటి యితనిలోని గూఢమయిన ఓర్పు, సహనం? ఎందుకివన్నీ మ్రింగి కూర్చున్నాడు - నవ్వుకున్నాడు సుధాకర్ - ఏమీ లేదు, యిదంతా యతిరాజమ్మకు హుళక్కి అనడానికే!

కాలగతి, మనషిలో ఎంత మార్పును తీసుకు వస్తుంది.! నిజాయితీనే కోల్పోయేటట్లు చేస్తుంది. దానికి కారణం ఏమిటి? పరిస్థితులలోని మార్పా అనిపించింది. అయితే ఈ కాలంలో నమూనాకైనా హరిశ్చంద్రులు లేరా? ఎంత విషమ పరిస్థితులలో కూడా, చివరకు నక్షత్రకుని సలహామీదనైనా హరిశ్చంద్రుడు బాకీ లేదని, ఈయలేనని అనలేదే? అటువంటి శీలం, పట్టుదల, కలియుగంలో అంతరించిందా అనిపించింది సుధాకర్‌కు. పైగా తన దుశ్శీలతకు, దుర్నడవడికి సుధాకర్‌ను యింధనంగా ఉపయోగిస్తున్నాడు భూమయ్య. ఎందుకనో సుధాకర్‌కు చాల బాధ అనిపించింది. తన వృత్తిపై తాత్కాలికంగా ఏహ్యాభావం కలిగింది. అయినా తన వృత్తి యేం చేసింది? తన్ను యిటువంటి దుశ్శీలులకు తోడ్పడమని హెచ్చరించిందా? కేసులో బలాబలాలను మంచి చెడులను నిర్ణయించుకునే శక్తి, స్వాతంత్ర్యము తన కున్నవి. ఎవ్వరూ తనను నిర్బంధించలేరు! అవును. తాను యతిరాజమ్మను మోసం చేయలేడు. అందుకు భూమయ్యకు అండగా నిలబడలేడు. నిలబడడు.

"భూమయ్యగారూ!" అని పిలిచాడు సుధాకర్.

"అయ్యా!" అంటూ భూమయ్య బూట్లుచప్పుడు చేసుకుంటూ లోపలకు రాబోయి, నాలిక కొరుక్కుని, బూట్లు గుమ్మం దగ్గర వదలి, లోపలకు వచ్చి, టేబిలు దగ్గర వినయ విధేయతలతో నిలబడ్డాడు.

భూమయ్య వచ్చేసరికి తాను అతని రికార్డే చదువుతున్నాడు. భూమయ్యకు తనపై గల నమ్మకం, ఆశ చూస్తుంటే తనలో విపరీతమైన జాలి కలుగుతోంది. ఎక్కడినుంచో తనలో అతని

విశ్వాసాన్ని వమ్ము చేయకుమని మనసు బోధిస్తోంది. మళ్ళీ ఒక ప్రక్కన పాపంలో పాలుపంచుకొన వద్దనిపిస్తోంది. న్యాయానికీ, ధర్మానికీ తీరని సంవాదం జరుగుతోంది. వృత్తిలో తారాపథాన్ని అందుకోవలసిన తాను యిటువంటి కేసులు తీసుకోరాదు. పేరు పాడయిపోతుంది. తన కీర్తి కాంతివంతం కాజాలదు!

"భూమయ్య గారూ! నేను ఈ కేసు చెయ్యను. క్షమించండి. రికార్డు తీసుకువెళ్లండి." అన్నాడు సుధాకర్ రికార్డు కడుతూ.

భూమయ్య ఒక్కసారి కుప్పగా కుర్చీలో కూలబడ్డాడు. అయిదు నిమిషాలు మాట్లాడలేకపోయాడు.

"ఏమయ్యా! పాయింటు లేదా?" అన్నాడు అనుభవజ్ఞుడిలాగా.

"ఫాక్టు మీద పాయింటు లేదు." అన్నాడు సుధాకర్.

"పోనీండి. లా పాయింటు లేదా?" అన్నాడు భూమయ్య.

సుధాకర్ మాట్లాడలేదు.

"అదేమిటయ్యా! మీరు తలుచుకుంటే పాయింటు తీయలేరా. మిసప్రాప్రియేషన్ కేసులో తమకు ఎంత పేరు వచ్చింది. అది వినేకదా నేను తమ దగ్గరకు వచ్చింది. ఇవ్వాళరేపు మీ పేరు ఎంతగా చెప్పుకుంటున్నారు. మీరే అలా అంటే ఎలా?" అన్నాడు భూమయ్య.

భూమయ్య అన్నదాంట్లో వాస్తవం లేకపోలేదు. మన ప్రజ్ఞను యింకొకడు గోరంతలు కొండంతలుగా చేసి చెప్తుంటే ఎవరు కాదనగలరు. సుధాకర్ దర్పానికి కాస్త చక్కలిగింత పెట్టినట్లయింది.

"లా పాయింటు లేకేం?" అన్నాడు సుధాకర్ అదోరకంగా హుందాగా నవ్వుతూ.

"ఏ పాయింటు సార్!" అన్నాడు భూమయ్య. ముఖం విప్పారింది. గెలిచాననుకున్నాడు. సుధాకర్‌ది చల్లని చెయ్యి. దానికితోడు తన జాతకచక్రం కూడ చూపించుకున్నాడు. వ్యవహారంలో గెలుపు తనదే అని జాతకజ్ఞులు చెప్పారు.

"దావా 'కాలదోషం'(Limitation) పట్టింది. అదిగాక కాశయ్య లైసెన్సు లేకుండా వడ్డీ వ్యాపారం చేశాడు. కాన దావా చెల్లదు." అన్నాడు సుధాకర్ సిగార్ వెలిగిస్తూ.

"మరింకేం! అదీపాయింటు. నే చెప్పలా అయ్యా తమ ఆలోచన సూక్ష్మబుద్ధి! ఛా! ఆ ప్లీడరుగారికి లేందే! అందుకనేకదయ్యా తమదగ్గరకు వెతుక్కుంటూ వచ్చాను." అని ధీమాగా కుర్చీలో కూర్చున్నాడు, కాలుమీద కాలు వేసుకుని.

"అయినా, నేను ఈ కేసు పట్టను!" అన్నాడు సుధాకర్ సిగార్ ఆష్ ట్రేలో నలుపుతూ. ఇది సుధాకర్ మానరిజమ్. తాను ఒక అభిప్రాయానికి, నిర్ణయానికి వచ్చిన తరువాత తన భావాలకు ద్యోతకమయ్యే సిగార్‌ను ఆష్ ట్రేలో నులిమివేస్తాడు. అంతటితో ఆ అధ్యాయానికి పూర్తి అన్నమాట.

ఇది సుధాకర్ ఆఫీసుకు ఒకసారి వచ్చిన ప్రతి క్లయింటు ఇట్టే గమనిస్తాడు. బుద్ధిమంతుడు భూమయ్య దీన్ని గ్రహించాడు!

అదోవిధంగా నవ్వుతూ "ఎందుకని?" అన్నాడు, ఆర్గ్యుమెంటు ధోరణిలో, ఆఖరి తురుపుగా.

సుధాకర్‌కు జవాబు చెప్పవలసిన అవసరంలేదు. అయినా పెద్ద మనిషిని అసంతృప్తుని చేయడం మంచిది కాదు.

"అన్యాయం గనుక!" అన్నాడు ముక్తసరిగా.

"ఏది అన్యాయం?" అన్నాడు భూమయ్య.

"కాలదోషం పట్టిందని, ఋణాన్ని కాదనడం." అన్నాడు వ్యంగ్యంగా నవ్వుతూ సుధాకర్.

"మరి కాలదోషంపై ధర్మసూత్రాలను కూర్చుతూ చట్టమెందుకు యేర్పడింది ప్లీడరుగారూ? మీకు నేను చెప్పాలా! కాలదోషపు వాదన చట్టసమ్మతమేనని కదా సూత్రకారులు దానిని నియమించింది." అన్నాడు భూమయ్య తన అరవై ఏళ్ల ప్రాపంచి కానుభవంతో. భూమయ్య వాదనలో పాయింటు కనబడుతోంది. సుధాకరుడు ఆలోచనలో పడ్డాడు.

అయిదు నిమిషాలు ఓపికపట్టాడు భూమయ్య.

"న్యాయ సమ్మతమైన కాలదోషపు వాదనను అన్యాయమనే హక్కు న్యాయవాదులైన మీకు ఎక్కడిది?చివరకున్యాయమూర్తులు కూడ దానికి బద్ధులే. మీరు మీ కర్తవ్యాన్ని మరుస్తున్నారు." అన్నాడు భూమయ్య ఆఖరిసారిగా జరీ తలపాగా సర్దుకుంటూ.

సుధాకరుని ఎవరో తట్టి లేపినట్లయింది. అవును కేసును నిర్ణయించే బాధ్యత న్యాయవాది అయిన తనపని కానే కాదు. తన శక్తివంచన లేకుండా తన దగ్గరకు వచ్చిన పార్టీకి చట్టసమ్మతమైన న్యాయవాదన చేయవలసిన కర్తవ్యం తనపై వుంది. సిగార్ ముట్టించాడు.

అది సుధాకరుని అంగీకార సూచనగా భావించి, భూమయ్య సంతోషంతో అయిదు వందల రూపాయల నోట్లు పేపరు వైటుక్రింద పెట్టి, వకాల్తా సంతకం చేసేందుకు గుమాస్తా దగ్గరకు వెళ్లాడు. ఇదంతా ఆదుర్దాగా కళ్లజోడులోంచి గమనిస్తున్న గుమాస్తా రాజుగారు ఆనందంతో పిలకముడి వేసుకుని భూమయ్యను వివరాలు కనుక్కుంటూ వకాల్తా పూర్తిచేశారు.

## 4

ద్వితీయ సంగ్రామం ప్రారంభమయింది; సుధాకర్ వకాల్తా పుచ్చుకోవడంతో అన్సరుకు అమెండ్‌మెంటు అడిగాడు - దావాకు కాలదోషం పట్టిందని, కాశయ్య లైసెన్సు లేకుండా వడ్డీ వ్యాపారం చేశాడు కనుక దావా చెల్లనేరదని.

లా పాయింటు ఎన్నడైనను వాదించవచ్చును కనుక, కోర్టువారు ప్రత్యర్థులకు యాభై రూపాయల దిన ఖర్చులు యిచ్చి అన్సరు ఆమెండుమెంటుకు (సవరణకు) అనుమతియిచ్చారు.

ఖర్చులు జమచేస్తున్న భూమయ్య అదోవిధంగా నవ్వాడు. ఈ యాభై రూపాయల రుసుముతో యతిరాజమ్మ ఋణం నీటిపాలవుతోంది.

విచారణ ప్రారంభమయింది.

కేసు విచారణ అనగా దాదాపు సమవుజ్జీలయిన యిరువురు ప్లీడర్ల చదరంగపు ఆట అన్నమాట. కాకపోతే ఈ చదరంగంలో సజీవులయిన మానవులు పావులు. ఆయా ప్లీడర్ల బుద్ధికుశలత బట్టి ఈ పావులు నడుస్తాయి, పలుకుతాయి. ఆ యిరువురిలో ఒకరు అనుకోకుండా యింకొకరు ప్రత్యర్థుల ఆటను త్రోసిరాజంటాడు. ఆట కడుతుంది.

సుధాకర్‌కు ఈ ఆటలో చురుకుతనం ఎక్కువ. ప్రత్యర్థి యింకొకవైపు కాపు కాచుకుంటూ వుంటే అనుకోని వైపు నుంచి చొరబడి షహ్ అంటూ వుంటాడు. తప్పుకునేందుకు వీలులేక ప్రత్యర్థి విస్తుపోయి ఓటమిని అంగీకరించవలసి వస్తుంది.

సాధారణంగా సాక్షులను ప్రత్యర్థులు వొప్పుకొని వివాదాంశాలకు మాత్రమే వినియోగిస్తారు. యతిరాజమ్మ ప్లీడరు ఒక్క సాక్షిని విచారించాడు - కాశయ్య వడ్డీ వ్యాపారి కాదని రుజువు చేసేంత వరకు మాత్రమే. క్రాసు పరీక్షలో ఆ సాక్షి చనిపోయిన కాశయ్యకు గట్టిగా స్తోమతు ఈయలేకపోయాడు. ఆ ప్లీడరు, భూమయ్య ఏవిధంగానైనా తన వాదనలను రుజువు చేసుకునే నిమిత్తమై సాక్ష్యమునకు వస్తాడు కదా; క్రాసు పరీక్షలో యతిరాజమ్మ కేసంతా రుజువు చేసుకొనవచ్చని ఆశపడ్డాడు.

సుధాకర్ మాత్రము తెలివి తక్కువవాడా! భూమయ్యను బోనెక్కించలేదు! నలుగురు గట్టి వ్యాపారస్తులను సాక్షులుగా తెచ్చాడు కాశయ్య వడ్డీ వ్యాపారి అని చెప్పేందుకు. కాశయ్య వీధిలోనే అదే వ్యాపారం చేసేవారు గనుక వారి సాక్ష్యము తొణకక, బెణకక పెట్టని కోటగా నిలబడింది.

ఇరుపక్షాల న్యాయవాదులకు వాగ్యుద్ధం జరిగింది. న్యాయమూర్తులు శ్రద్ధగావిన్నారు. మరునాడు తీర్పు వచ్చింది. భూమయ్య జమలను ఎవరూ రుజువుచేయని కారణంతో దావాకు కాలదోషం పట్టిందనీ, కాశయ్య లైసెన్సు లేకుండా వడ్డీ వ్యాపారం చేశాడని రుజువుఅయింది కనుక, కోర్టువారు యతిరాజమ్మ దావాను కొట్టివేశారు. యతిరాజమ్మ ఓడిపోయింది.

పౌరుషవంతురాలయిన యతిరాజమ్మ అప్పీళ్లు చేసింది. వాటికి కూడ ఆ దుర్గతే పట్టింది.

భూమయ్య పట్టు నెగ్గింది. సుధాకరుని పేరు ప్రఖ్యాతులు యినుమడించాయి.

పైకోర్టు తీర్పు కూడా తనకు అనుకూలంగా వచ్చిన నాడు భూమయ్య సుధాకరుని ఛాంబర్సుకు వచ్చి, ప్లీడరుగారిని పూలదండలతో ముంచేసి, అతని వేలుకు వజ్రపుటుంగరం తొడిగాడు విజయ చిహ్నంగాను, తన జ్ఞాపకార్థంగానూ. ఛాంబర్సులోని పెడస్టల్ ఫాను పూలవాసనను విజయధ్వానాలతో మేళవించి నలుదిక్కులా వెదజల్లింది.

## 5

అవి వేసవి శలవులు. సివిలు ప్రాక్టీసు మాత్రమే చేసే సుధాకర్‌కు కోర్టు శలవలు. అతడు ఉదయం ఆఫీసులో ఒక్కడే కూర్చుని అవారం వచ్చిన లా జర్నలు చదువుకుంటున్నాడు. పెడస్టల్ ఫాను నిర్మలమైన పవనాన్ని ఏకాగ్రతతో అతని ఛాంబర్సును నింపివేస్తోంది.

"నమస్కారమండి!" అన్న అభివాదమును విని తలయెత్తాడు సుధాకర్. గుమ్మంలో భూమయ్య నిలబడి వున్నాడు. అదే పెద్ద జరీ తలపాగా, మోకాళ్ల వరకు లాంగుకోటు, పంపు షూతో నిలబడివున్నాడు. అతని లాంగుకోటు ఒకానొకప్పుడు భూమయ్య దృఢకాయుడు అని సూచిస్తోంది. ప్రస్తుతం ఆ లాంగుకోటు కేవలం ఒక కర్రకు గొడుకు తగిలించినట్లుగా వుంది.

భూమయ్య బాగా చిక్కిపోయాడు. అతని పెద్ద కళ్లల్లోంచి అతని ప్రాణంతొంగి చూస్తోంది. పంపుషూ గుమ్మంలో విడుస్తూ "నేను రావచ్చునా!" అన్నాడు వినయవిధేయతలను బలహీనమైన గొంతుకతో ప్రకటిస్తూ.

భూమయ్య గెలిచింతరువాత మళ్లీ రావడం యిది ఏడాది పిదప. ఈసారి ఏ ఋణభారాన్ని విముక్తి చేసుకునేందుకు వచ్చాడో అని నవ్వుకుంటూ ఆహ్వానించాడు సుధాకర్.

భూమయ్య తనకు విజయ చిహ్నంగా యిచ్చిన వుంగరం కోసం చేతివంక చూచుకున్నాడు. చేతికి లేదు. బాగుందని పోరుపెట్టితే భార్యకు యిచ్చిన మాట గుర్తుకు వచ్చింది.

భూమయ్య వచ్చి కుర్చీలో ఆసీనుడయ్యాడు. కుశల ప్రశ్నల అనంతరం సుధాకర్ ప్రశ్నించాడు. "ఈ సారి యేమిటని?"

"అయ్యా యతిరాజమ్మ ఋణభారాన్ని తీర్చుకునేందుకు వచ్చాను." అన్నాడు భూమయ్య.

సుధాకర్‌కు అర్థం కాలేదు. అదీకాక యతిరాజమ్మ కేసు వోడిపోయిన తరువాత ఇంకా ఋణమేం మిగిలిందా భూమయ్య తీర్చేందుకు - అనుకున్నాడు.

పెడస్టల్ ఫాను అవ్యాజమయిన ధ్వానాలను చేస్తూంది. భూమయ్య బరువుగా నిట్టూర్చి చెప్ప ప్రారంభించాడు.

"వకీలుగారూ మీరు కేసు పట్టనన్న నాడు నాకు అర్థం కాలేదు; నీతికి న్యాయానికి ఎంత తేడావుందో! అనుభవజ్ఞులు మీరు దాన్ని గ్రహించే కేసు పట్టనన్నారు. మూర్ఖుణ్ణి బలవంతపెట్టాను.

కేసు గెలిచాము. యతిరాజమ్మ ఋణశేషాన్ని కాలదోషంలో పడిందని త్రోసిరాజనగలిగాము. నా మనసు వుపశమించింది. కాశయ్య వదలిన ఈ కాస్త ధనంతో జీవితశేషం గుడుపుకుందామనుకున్న యతి రాజమ్మకు యిది తీరని ఘాతమయింది. వాళ్ల వాళ్ల మాటల నమ్మి వున్న సొమ్ములన్నీ ఖర్చుపెట్టి అప్పీలు చేసి హైకోర్టుదాకా వెళ్లిందికాని చట్టసమ్మతమైన కాలదోషం, కాలసర్పంలాగా యతిరాజమ్మను కాటువేసింది. కేసు గెలిస్తే వసూలు చేసుకొనవచ్చును కొన్న అప్పులవాళ్లు యతిరాజమ్మను బాధించదొడగారు. యతిరాజమ్మ జీవితం అంధకారబంధురం అయింది. తాను చేసిన ఋణాలకు కాలదోషం అడ్డురాలేదు. మార్గం తోచలేదు. ఆత్మహత్య చేసుకుంది!

ఇటు నేను మాత్రం బాగుపడ్డ దేముందయ్యా? కేసు గెలిచిన తరువాత నుంచీ మంచమెక్కాను; కాలవాహినితో చావు బ్రతుకులపై మాట్లాడవలసి వచ్చింది. ఎప్పటికప్పుడు మీ కోసరమై ఖబురు పంపుదామనుకునే వాణ్ణి. మంచం మీద పడుకున్నప్పుడల్లా నాకిదే సమస్య. నా గెలుపెంత వరకు ధర్మసమ్మతమైనదా అని తరచి తరచి చూచాను. నాది గెలుపు కాదు. నాదే పూర్తిఓటమి. చట్టము నీడలో నక్కి నీతిని, ధర్మాన్ని కోల్పోయాను. అందుకనే అంటారు చట్టబద్ధమైన న్యాయానికి చెవులున్నాయే గాని కళ్ళు లేవని. మంచం మీద వున్నంతకాలం తరచి తరచీ చూచాను. నాకు మిగిలిన యావదాస్తి యతిరాజమ్మ పేరన వ్రాస్తేనే గాని నాకు నిష్కృతి లేదనిపించింది. మీకు ఖబురు పంపుదామనుకుంటుండగా నాకు వార్త తెలిసింది యతిరాజమ్మ కాలం చేసిందని. అంత్యక్రియలు చేసేవాళ్లెవరూ లేక పోతే కార్పొరేషన్‌వారే పూనుకోవలసి వచ్చిందట పాపం! నేను చేసిన అవినీతి పనికి క్షమార్పణ లేదు. కనీసం యతిరాజమ్మ వారసులుకూడ ఎవరూ లేరు, పోనీ ఋణశేషాన్ని వాళ్లకు ధారాదత్తం చేద్దామంటే!

బాగా ఆలోచించి చూచాను. ఒక్కటే మార్గం తోచింది. భగవంతుణ్ణి ప్రార్థించాను కనీసం యిదైనా పూర్తిచేసేంత వరకు నాకు అవకాశమివ్వవలసిందని. రెండు రోజుల లయింది పత్యం తిని. కాస్త యివ్వాళ సుళువుగా వుంది. ఉదయాన్నే మీ యింటికి వచ్చాను; మీ దర్శనం చేసుకొని ఋణవిముక్తుణ్ణవుదామని." అన్నాడు.

అర్థంకాక సుధాకర్ భూమయ్య వంక చూస్తూ సిగార్ ముట్టించాడు, ధూమపానం యేమైనా కీలకం యిస్తుందేమోనన్న ఆశతో.

భూమయ్య కోటు చాటునుంచి నోట్ల కట్టలు తీసి బల్ల మీద పెట్టాడు. సుధాకర్, భూమయ్య ఈ వింత ప్రవర్తనను అర్థం చేసుకో ప్రయత్నించసాగాడు.

"అయ్యా యతిరాజమ్మ బాకీ ఈ నాటి వరకు వడ్డీతో సహా ఏడు వేల అయిదువందలు అయింది. కాలదోషపు వాదనతో అది నీటిపాలయింది. ఈ పాపానికి నిష్కృతికై ఒక్కటే మార్గముంది." అన్నాడు.

"ఏమిటది?" అన్నాడు సుధాకర్ అనుమానంగా.

"ఆనాడు మీరు కూడ పాత ప్లీడరుగారి వలెనే కేసులో బలం లేదని అని అంటే ఋణం తీర్చుకుని విముక్తుడనయ్యే వాడిని. లాపాయింటు వుందనే సరికి నా విద్రోహానికి, అవినీతికి దాన్ని వినియోగించుకున్నాను. ఈనాడు నా పాపం పరిహారం గావాలంటే, దానిక మార్గం చూపించ కలిగిన మీకే ఈ ఋణ భారాన్ని తీర్చదలచుకుంటున్నాను. కాలదోషం పట్టించ గలిగిన నైతిక బాధ్యతను, న్యాయవాదులైన మీరే ఈ భారాన్ని వహించవలసి వుంటుంది. కాన యతిరాజమ్మ పరంగా ఈ రూపాయలు మీరు తీసుకుని సద్వినియోగం చేయండి. నన్ను ఋణవిముక్తుణ్ణి చేయండి." అని అంటూ భూమయ్య సుధాకర్ ముందుకు నోట్ల కట్టలను తోశాడు.

భూమయ్యలోని ఈ అనిర్వచనీయమైన నైతిక విజ్ఞానానికి, మార్పుకు, సుధాకరునికి చాల ఆశ్చర్యం కలిగింది! అయ్యో! ఆనాడు తాను అన్యాయమైన కేసుపట్టనన్న పట్టుదలను ఎందుకు సడలాడా అని విచారపడసాగాడు. భూమయ్య అన్నట్లు తాను మార్గదర్శకుడు కానట్టయితే భూమయ్య ఈ అవినీతికి పాల్పడేవాడు కాదేమో ననిపించింది. కాలదోషపు వాదనలో నైతిక పతనం పొందిన భూమయ్యకు సంస్కారం కలిగింది; నైతిక విజ్ఞానం కలిగింది. తానుమాత్రం కేవలం న్యాయవాదేనా నైతిక వాదికాదా! తానుమాత్రం ధర్మానికి నీతికి బద్ధుడు కాడా! సిగార్ ఆష్ట్రేలో నులిమాడు.

సుధాకరుని పై చెప్పిన మానరిజ మెరిగినవాడు కాన భూమయ్య సుధాకర్ తీర్పుపై ఎంతో ఆశగా చూచాడు. సుధాకర్ రొటేటింగు చైర్ వెనక్కుత్రోసి, ఛాంబర్సుకు అంటిపెట్టుకున్న గదిలోకి వెళ్లి, భార్యను పిలచాడు గట్టిగా.

వేసవి శలవలకు తన యింటికి వచ్చిన చెల్లిలితో భార్య తమ పుట్టింటి చిన్ననాటి అనుభవాలను, కష్టసుఖాలను సింహావలోకనం చేసుకుంటోంది. సుధాకర్ కేకవిని వచ్చింది. ప్రశ్నార్థకంగా భర్తవంక చూచింది. దూరం నుంచి మరదలు సుధాకరుని గంభీర వదనాన్ని గమనిస్తోంది.

"చెక్కు బుక్కు ఏదీ?" అన్నాడు సుధాకర్ జేబులోంచి పెన్నుతీస్తూ.

పాదుపరి అయిన సుధాకర్ భార్య, అలమారలోంచి చెక్కు బుక్కు తీసియిస్తూ "ఎందుకూ?" అంది భయసంభ్రమాలతో. సుధాకర్ ధనం దుర్వినియోగం చేస్తాడని, సంసారం సంగతి బొత్తిగా పట్టదని, అతని భార్య గట్టి నమ్మకం. అందుకని దాన ధర్మాలు విరాళంగా, చెక్కుల రూపంగా పోకుండా, ఆమె దగ్గర వుండి ఆడిట్ చేస్తూంటుంది.

చెక్కు మీది అంకెలు చదివింది. పదిహేను వందలు. తన కళ్లను తాను నమ్మలేకపోయింది.

"ఏదీ! భూమయ్యగారు ఇచ్చిన వుంగరం ఇయ్యి." అన్నాడు.

భయంతో తీసియిస్తూ "ఏమిటిదంతా? ఎవరికీ? ఎందుకూ?" అంది చెక్కు మీది అంకెలను మాత్రమే అర్థం చేసుకోగలిగిన సుధాకరుని భార్య!

సమాధానం చెప్పకుండానే సుధాకర్ ఛాంబర్సులోకి వెళ్లాడు.

"భూమయ్యగారూ! మీ ఈ నైతిక సంస్కరణకు, విజ్ఞానానికి నా నమోవాకములు. మీరు నాకు కళ్లు తెరిపించారు. అవినీతికరమైన కేసులు పట్టగూడదని - తప్పు చేస్తే కాని అనుభూతి కలగదని మీకేసును వాదించి కాలదోషం పట్టించడంతో నాకు ఈ అనుభూతి కలిగింది. మీరు యతిరాజమ్మ ఋణభారాన్ని నాకు యిచ్చి ఋణ విముక్తుల మవుదామనుకుంటూ నాకు చక్కని నీతిపాఠాలు నేర్పారు. ఇంకా నా కాలు జారనీయకండి. ఇదుగో మీరు నాకు మూడు కోర్టులలోను యిచ్చిన ఫీజుకు చెక్కు, విజయ చిహ్నంగా యిచ్చిన వుంగరం, ఈ ఏడువేల అయిదువందలు. మీది ఋణభారం అయితే, యివి నాకు తీరని ఋణభారాలు. ప్రస్తుతం ఋణ గ్రహీతలు లేరు గనుక ఈ మొత్తాన్ని అనాథ శరణాలయానికి సద్వినియోగం చేయమని, యతిరాజమ్మ పేరిట దానం చేయండి". అంటూ, బలవంతంగా బల్ల మీద వున్న భూమయ్య తలపాగాలో నోట్ల కట్టలను పదిహేనువందల చెక్కును, ఉంగరాన్ని వుంచాడు సుధాకర్.

భూమయ్య దిగ్భ్రాంతుడయ్యాడు. అయిదు నిమిషాలు ఆగాడు. సుధాకర్ యింకొక సిగార్ వెలిగించాడు. భూమయ్య సుధాకరుని అర్థం చేసుకో గలిగాడు.

"ప్లీడరుగారూ! మీరందరిలాంటి న్యాయవాదులు కారు. మన యిరువురి జీవితపు మలుపులకు చిహ్నంగా మాత్రం ఈ వుంగరాన్ని మీరు వుంచుకోండి." అంటూ బలవంతంగా సుధాకరుని వ్రేలికి వుంగరం తొడిగి బూట్లు చప్పుడు చేసుకుంటూ మేడమెట్లు దిగి భూమయ్య ప్రకృతిలోనికి నిష్క్రమించాడు.

"చూడవే చెల్లెలా! వారెప్పుడూ యింతే! ఇట్లాగే అంతా నాశనం చేస్తున్నారు. పెళ్లి కెదిగిన పిల్లవుందనయినా వారికి ఆలోచన లేదు." అంటున్న భార్య మాటలు ఛాంబర్సులోనికి పెడస్టల్ ఫానుగాలిని తోసుకుంటూ వచ్చాయి.

సుధాకర్ అదోవిధంగా నవ్వుకుంటూ సిగార్ ఆష్ట్రేలో నులిమి, పెడస్టల్ ఫాను స్పీడు హెచ్చించాడు.

✸

భారతి, జులై 1960.